క్లుప్తంగా

200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న మహిళా పోలీసు మనీషా

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అర్జునగిరి– పెదగోగాడ గ్రామాల మధ్య సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుపును బుధవారం ధ్వంసం చేశారు. అర్జునగిరి సచివాలయం మహిళా పోలీసు జి. మనీషా రెండు డ్రమ్ములతో ఉన్న 200 లీటర్ల పులుపును ధ్వంసం చేశారు.

డీసీసీబీ బ్రాంచ్ నూతన భవనం పరిశీలన



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

నర్సీపట్నం: స్థానికంగా నూతనంగా నిర్మించిన డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయ భవనాన్ని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు బుధవారం పరిశీలించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా నర్సీపట్నం వచ్చిన గురువులను పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి గుడివాడ సన్యాసినాయుడు, మెంబర్లు గవిరెడ్డి స్వామినాయుడు, గవిరెడ్డి శ్రీను, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ నాయుడు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ నెల 24న కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని గురువులు అధికారులను ఆదేశించారు.

అయ్యప్ప స్వామికి వెండి కిరీటం



వెండి కిరీటాన్ని అందిస్తున్న సతీష్ కుటుంబ సభ్యులు

రావికమతం: కొత్తకోట గ్రామానికి చెందిన ద్వారపూడి సతీష్ అనే భక్తుడు గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి వెండి కిరీటాన్ని మంగళవారం రాత్రి అందజేశాడు. మాలధారణ చేసిన సతీష్, అతని కుటుంబ సభ్యులు శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి భారీ ఎత్తున అంబలం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రూ.15వేల విలువ చేసే వెండి కిరీటాన్ని గురుస్వాముల చేతుల మీదుగా అందించారు.

కార్మికురాలికి రూ.10వేల ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహాంజలి సభ్యులు

రావికమతం: స్నేహాంజలి అసోసియేషన్ సభ్యులు జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికురాలు మార్తి దేవికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. దేవి జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ దివ్యాంగుడైన తండ్రి, వృద్ధురాలైన తల్లిని పోషిస్తోంది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురై, విశాఖలోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. దీంతో ఆరు నెలలుగా ఇంటికే పరిమితమైంది. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో ఆ సంస్థ సభ్యులు బోగేసు,నల్లయ్య, ప్రకాష్,హరి తదితరులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



ధర్మశ్రీ,చొక్కాకులను సన్మానిస్తున్న నాయకులు



నర్సాపురంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. కొమళ్లపూడి అమరపురి బాబా ఆశ్రమం వద్ద వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమ పథకాలతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.ఐదు లక్షలు వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ రెండోసారి గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో కార్యకర్తలంతా సమిష్టిగా ఉండి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. చోడవరం నియోజకవర్గంలో జరిగే సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని విప్ ధర్మశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి చొక్కాకుల వెంకటరావు పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీ నుంచి ప్రతి సచివాలయ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించాలని, సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి, పథకాలు అందేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల ఇన్‌చార్జి గేదెల శేషు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు,మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పినపోలు వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి మోటూరి చిన్నంనాయుడు తదితర్లు విప్ ధర్మశ్రీ , నియోజకవర్గ ఇన్‌చార్జి చొక్కాకుల వెంకటరావులను ఘనంగా సత్కరించారు.

బూత్ కమిటీల ఏర్పాటుపై దృష్టిసారించాలి

చోడవరం: బూత్ కమిటీల ఏర్పాటుపై గ్రామస్థాయి నాయకులు పూర్తిస్థాయిలో దృష్టిసారించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలో నర్సాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామస్థాయి నాయకులంతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. అర్హులైన వారిని కొత్త ఓటర్లు నమోదు చేయించడంతో పాటు, అనర్హులైన ఓటర్లను గుర్తించి వారిని తొలగించడానికి అధికారులను సూచించాలన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ సర్పంచ్ దొడ్డి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వరికి సుడిదోమ, కంకినల్లి బెడద



లచ్చన్నపాలెంలో వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మాకవరపాలెం: వరిపంటకు సుడిదోమ, కంకినల్లి పురుగులు ఆశించినట్టు అనకాపల్లి రైతుపరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఇటీవల చోటు చేసుకున్న వాతావరణ మార్పుల కారణంగా మండలంలో వరిపంటకు అధికంగా తెగుళ్లు సోకాయి. ఈ నేపథ్యంలో బుధవారం శాస్త్రవేత్తలు అప్పలస్వామి, నాగేంద్ర మండలంలోని పైడిపాల, కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి పొలాలను పరిశీలించి, సుడిదోమ, కంకినల్లి పురుగుల ఉధృతి ఉన్నట్టు తెలిపారు. సుడిదోమ నివారణకు పొలంలో నీరు నిల్వ లేకండా తొలగించడంతోపాటు బుప్రొపెజిన్ లేదా ఎసిపేట్ మందును, కంకినల్లి నివారణకు డైమిడోమోట్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వారి వెంట స్థానిక ఏవో చిరంజీవి ఉన్నారు.

నేడు పల్లెకుపోదాం కార్యక్రమం

రావికమతం: స్థానిక సచివాలయం వద్ద గురువారం పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొంటారని చెప్పారు. ఆ సచివాలయ పరిధిలో ఇప్పటి వరకూ అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించడంతో పాటు వాటిపై ప్రజలకు వివరిస్తారని తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామాల్లో సభలు



రామన్నపాలెంలో మ్యాప్ ద్వారా పనులను వివరిస్తున్న ఏపీవో

మాకవరపాలెం: మండలంలోని మూడు గ్రామాల్లో కొత్తగా చేపట్టే ఉపాధి పనులపై సభలు నిర్వహించారు. 2024–25లో చేపట్టే కొత్త పనులను ఇప్పటికే గుర్తించిన నేపథ్యంలో బుధవారం రామన్నపాలెం, పైడిపాల, జంగాలపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూలీలకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా కొత్త పనులను గుర్తించామన్నారు. వీటిని స్థానికులకు మ్యాప్ ద్వారా తెలియజేసి వారి ఆమోదం తీసకుంటున్నట్టు చెప్పారు. ఆ గ్రామాల్లోనూ రూ.3.60 కోట్లతో పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

కేజే పురంలో 86 మందికి వైద్యసేవలు



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం సచివాలయం పరిధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాదు 86 మందికి వైద్య సేవలందించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ఆరోగ్య కార్యకర్తలు అచ్యుతాంబ, సత్య, ఎంఎల్‌హెచ్‌పీ లలిత తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌లో కాశీపురం విద్యార్థుల ప్రతిభ



నాచుతో నాణ్యమైన పెట్రోల్ ప్రాజెక్టుతో కాశీపురం హైస్కూల్ విద్యార్థులు

దేవరాపల్లి: చోడవరంలో జోనల్ స్థాయిలో మంగళవారం జరిగిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'నాచుతో నాణ్యమైన పెట్రోల్ తయారీ' ప్రాజెక్టు ప్రదర్శించి ప్రథమ స్థానం పొందారు. ఈ ప్రాజెక్టు జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం పి.బి.టి. సుందరి తెలిపారు. బయాలజీ ఉపాధ్యాయిని బుర్ర పూర్ణిమ పర్యవేక్షణలో విద్యార్థులు అనన్య, అఖిల్ ఈ ప్రాజెక్టు తయారు చేశారు. విద్యార్థులను, బయాలజీ టీచర్‌ను ఎంఈవో–1 బి.పడాల్ దాస్, ఎంఈవో–2 వి.ఉషారాణి అభినందించారు. ఈ నెల 9న కశింకోటలో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని హెచ్ఎం సుందరి తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం



గొండుపాలెంలో గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : గొండుపాలెంలో గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గౌరీ సేవా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పూజలు జరిపారు. మధాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల్లో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను మహిళల కోలాటం కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు.

లైసెన్స్ ఉన్నవారే బాణసంచా విక్రయించాలి



పెద్ద చెరువు ప్రాంతం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో హెచ్.వి.జయరాం

నర్సీపట్నం: లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకాలు సాగించాలని, అనుమతిలేని విక్రేతలపై చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్.వి.జయరాం హెచ్చరించారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే పెద్ద చెరువు ప్రాంతాన్ని పోలీసు, ఫైర్ అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలను, 200 లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన డ్రమ్ములను ఉంచాలన్నారు. బాణసంచా కొనేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, టౌన్ సీఐ ఎస్. గణేష్, ఎస్ఐ సుధాకర్, ఫైర్ అధికారులు ఉన్నారు.

రావికమతం: అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ చేసినా చర్యలు తప్పవని తహసీల్దార్ మహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాని చెప్పారు. పోలీసు,అగ్నిమాపక శాఖ,రెవెన్యూ శాఖ అనుమతులు తీసుకుని ఊరికి దూరంగా తగిన జాగ్రత్తలతో బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపాలిటీ బలిఘట్టానికి చెందిన తమరాన తమరాన చినబాబు కుమారుడు రవితేజ బైక్ ప్రమాదంలో మరణించాడు. బాధిత కుటుంబానికి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ,ఏఎంసీ చైర్మన్ ముళ్ల గణేష్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీను, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వార్డు నాయకులు యాదిగిరి శేషు, కిల్లాడ లోవరజు, ఎల్లేటి శ్రీను, బ్రహ్మలింగేస్వామి దేవస్థానం చైర్మన్ శెట్టి చిన్న, యలమంచిలి వేణు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నర్సీపట్నం గ్రంథాలయాధికారి దమయంతి



కరపత్రాలను హెచ్ఎంకు అందజేస్తున్న చౌడువాడ గ్రంథాలయాధికారి పద్మావతి

నర్సీపట్నం/కె.కోటపాడు/రావికమతం: శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు నర్సీపట్నంలో వారోత్సవాల కరపత్రాలను గ్రంథాలయ అధికారి పి.దమయంతి విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి 20న విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆమె చెప్పారు. కె.కోటపాడు మండలం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వారోత్సవాల గురించి చౌడువాడ హైస్కూల్, ఎంపీపీ పాఠశాలల హెచ్ఎంలకు బుధవారం గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి వివరించి, కరపత్రాలను అందజేశారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని ఆమె కోరారు. రావికమతం మండలం కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహించే కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఆర్.వరహామణి బుధవారం వివరించారు.

యూకలిప్టస్ చెట్ల ఫలసాయానికి వేలం..

కోటవురట్ల : యూకలిప్టస్ చెట్ల ఫలసాయానికి నిర్వహించిన వేలానికి మంచి స్పందన వచ్చింది. వేలంలో ఫలసాయాన్ని దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం వేలం నిర్వహించారు. ఈవోపీఆర్డీ భానోజీరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం వేలం నిర్వహించగా పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ కోటవురట్ల గ్రామ పంచాయతీ పరిధి సర్వే నంబరు 316లో సుమారు 470 టన్నుల యూకలిప్టస్ చెట్లకు వేలం నిర్వహించినట్టు తెలిపారు. సర్వసిద్ధి గణేష్ అనే వ్యక్తి రూ.21.90 లక్షలకు వేలం దక్కించుకున్నట్టు తెలిపారు.

పారదర్శకంగా బాణసంచా దుకాణాల కేటాయింపు

మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: పారదర్శకంగా బాణసంచా దుకాణాలు కేటాయింపు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దుకాణాల కేటాయింపు ప్రక్రియ మొదలు కాకుండానే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిబంధనల మేరకు లైసెన్స్‌దారులకు దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. బాణసంచా విక్రయించేందుకు అనుమతులు కోరుతూ చాలా మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అనుమతులకు దరఖాస్తులు చేసుకున్న వ్యాపారుల సంఖ్యను బట్టి దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. ఆరోపణలకు తావులేకుండా దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందన్నారు. వ్యాపారులు, కొనుగోలు చేసేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా పెద్ద చెరువు ప్రాంతంలో దుకాణాల సముదాయం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా గౌరీపరమేశ్వర్ల సారె ఊరేగింపు



పేటలో నెలకొల్పిన గౌరీపరమేశ్వర్ల విగ్రహం



సారె ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో గౌరీపరమేశ్వర్ల సారె ఊరేగింపును బుధవారం రాత్రి గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సారె ఊరేగింపులో వందలాది మంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



లక్ష్మికి నగదును అందజేస్తున్న అనురాధ, సన్యాసినాయుడు, రామునాయుడు

కె.కోటపాడు: రోడ్డు ప్రమాదంలో మరణించిన సూదివలస గ్రామానికి చెందిన డొక్కరి మౌళినాయుడు(అక్కునాయుడు) కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అందజేశారు. ఈ నెల 2న విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మౌళినాయుడు మరణించాడు. దీంతో మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు రూ.5లక్షలు మంజూరైంది. తక్షణ సాయం కింద రూ.10వేల నగదును జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, వీవోఏ రంధి రామునాయుడు బుధవారం మృతుని భార్య లక్ష్మికి అందించారు. మిగిలిన నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు వీరు తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దు



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలు విద్యార్థి, యువజన సంఘాల నేతృత్వంలో బుధవారం విద్యాసంస్థల బంద్, నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. పీడీఎస్‌వో, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, వాటి అనుబంధ యువజన సంఘాల నేతృత్వంలో పట్టణంలోని విద్యాసంస్థలను మూసివేయించి, బంద్ పాటించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంప్లెక్సు ఎదుట మానవహారం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా నాయకులు సియ్యాద్రి రుద్రి, ఏ.మౌనిక, బి.రాజేష్, పద్మావతి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.వి.నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సుందర్, ఎం.కామేష్, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. సీఐటియూ నాయకుడు దేవుడునాయుడు విద్యార్థుల నిరసనకు తన సంఘీభావాన్ని తెలిపారు.

గాయపడిన కార్మికుడికి సీఎం సహాయ నిధి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: మార్బుల్స్ దించుతూ గాయపడిన సురవరం గ్రామానికి చెందిన కార్మికుడు ఇంజపు రెడ్డి గణేష్‌కు రూ.85 వేల సీఎం సహాయనిధి చెక్కును బుధవారం స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ అందజేశారు. గణేష్‌కు ఆరు నెలల కిందట కాలిపై గాయమైంది. ఆరోగ్యశ్రీ వర్తించని కారణంగా గ్రామస్తులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి ఈవిషయం తీసుకెళ్లారు. ఆయన చొరవతో నగదు మంజూరైంది. ఈ కార్యక్రమంలో సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ, సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాధు సూర్యకాంతం, జగ్గారావు, యన్నంశెట్టి వెంకట్రావు, కొండలరావు, రమణబాబు తదితర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గణేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల సచివాలయాలకన్వీనర్ ఈర్లె చైతన్య

మాడుగుల రూరల్: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య తెలిపారు. బుధవారం చీడికాడ మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు అధ్యక్షతన మండలంలో ముఖ్య నాయకులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ అప్పలరాజుపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమాన్ని గురువారం(ఈ నెల 9 వ తేదీ) ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, పార్టీ నాయకులు కురచా నారాయణమూర్తి, లాలం జానకీరామ్, చుక్క అప్పలనాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ధర్మిశెట్టి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మాడుగుల రూరల్/గొలుగొండ/రోలుగుంట: మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. మాడుగుల మండలం ముకుందపురంలో నిర్వహించే కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ కోరారు. గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ కోరారు. రోలుగుంట మండలం ఎం.కె.పట్నం సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొంటారని చెప్పారు.